
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

ఆదివారం 23 జూన్ 2024





ప్రవేశాలకు.. ప్రతిబంధకాలు

- దైన్యస్థితిలో ఎన్నో డిగ్రీ కళాశాలలు
- గత ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో ఇక్కట్లు
- మేజర్, మైనర్ విధానంతో మరింత గందరగోళం

గుంటూరు(విద్య), జూన్ 22 : డిగ్రీ కళాశాలలు పలు కోర్సులతో వేల సంఖ్యలో విద్యార్థులతో కళకళలాడేవి. ఇంజనీరింగ్ తదితర ఎన్నో కోర్సులు వచ్చినా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు డిమాండ్ తగ్గేది కాదు. సామాజిక చైతన్య కేంద్రాలుగా డిగ్రీ కళాశాలలు విలసిల్లేవి. విద్యావేత్తలు, ప్రభుత్వాలు కూడా డిగ్రీ కళాశాలలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలు డిగ్రీ కళాశాలల పాలిట శాపాల్లా మారాయి. ఒకప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఫలానా కాలేజీలో డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందడం అంటే ఓ ఘనతగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భావించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కారణంగా విద్యార్థుల ప్రవేశాలు సరిగా లేక ఆయా కళాశాలలు దైన్యస్థితికి చేరాయి. వందేళ్ల చరిత్ర ఉన్న పలు డిగ్రీ కళాశాలల్లో గతంలో బీఎస్సీ, బీకాం, బీఏ, బీబీఏ, బీసీఏ వంటి డిగ్రీ కోర్సులకు ఎంతో డిమాండ్ ఉండేది. ఫలితంగా విద్యార్థులతో కళకళలాడిన డిగ్రీ కళా శాలలు నేడు విద్యార్థుల లేక వెలవెలపోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలు, జాతీయ విద్యా విధానం పేరుతో తీసుకువచ్చిన అనేక సంస్కరణలు డిగ్రీ కళాశాలలకు గుదిబండగా మారడంతో ఈ దుస్థితి నెలకొందని అధ్యాపకులు వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 20 వరకు ఎయిడెడ్ డిగ్రీ కళా శాలలు ఉండగా అరకొర అడ్మిషన్లతో నెట్టుకు వస్తున్నాయి. డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వడంలో కూడా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. దీంతో ఎక్కడా చేరలేకపోయిన వారు, సప్లమెంటరీ విద్యార్థులు మాత్రమే డిగ్రీ కళాశాలల్లో చేరుతున్నారు. మెరిట్ విద్యార్థులు ఇతర వర్సిటీలకు తరలిపోతున్నారు. గతంలో ఒక్కో కళాశాలలో సగటున వెయ్యి నుంచి 2 వేల మంది విద్యార్థులు ఉండేవారు. గతంలో ఇంటర్ ఫలితాలు రాగానే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యేవి. అయితే రెండేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ అడ్మిషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇది గందరగోళంగా మారడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఆ నోటిఫికేషన్ కూడా ఎప్పుడు వస్తుందో తెలియక గ్రామీణ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



గుంటూరులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

నూతన విద్యా విధానంతో గందరగోళం

డిగ్రీలో నూతన విద్యావిధానం ప్రకారం మేజర్ మైనర్ కోర్సులంటూ ప్రవేశ పెట్టారు. ఉదాహరణకు బీఎస్సీ(గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ) తీసుకుంటే ఇందులో గణితం మేజర్ సబ్జెక్టుగా ఫిజిక్స్, కెమిస్ట్రీ మైనర్ సబ్జెక్టులుగా ప్రాధాన్యం లేని విధంగా ఉంటున్నాయి. మూడేళ్లలో గణితానికే అధిక ప్రాధాన్యం ఇస్తూ మైనర్ సబ్జెక్టుల గురించి పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఫలితంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు భారీగా గండి కొట్టినట్లు అవుతుందని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాతపద్ధతిలో మూడు సబ్జెక్టులకు సమ ప్రాధాన్యం, సమానమైన మార్కులు ఉండేవి కొత్త విధానంలో అటువంటి పరిస్థితి లేదు.

మరోవైపు ఇంటర్ సప్లిమెంటరీలో పాస్ అయిన వారికి అనేక కళాశాలల్లో సీట్లు రావడం లేదు. డిగ్రీ కోర్సులకు ప్రభుత్వం సగటున రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తోండగా అది ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అనేక మంది విద్యార్థులకు ఫీజు రీయిం బర్స్‌మెంట్ సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో చివరి రెండు, మూడు సంవత్సరాల్లో విద్యార్థులు భారీ సంఖ్య లో డ్రాపవుట్స్ అవుతున్నారు. ఒకప్పుడు విద్యార్థినులతో కళకళాడిన గుంటూరులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సైతం అడ్మిషన్లకు ఇక్కట్లు వస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇంటర్ ఫలితాలు విడుదలై రెండు నెలలు గడుస్తున్నా ఇంకా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ రాలేదు. ఈ ఏడాది ఆన్‌లైన్‌లోనా లేక ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు చేస్తారో తెలియక విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

జీవో 77తో పీజీ కోర్సులకు చెక్

డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఎక్కువ మంది పీజీ కోర్సుల వైపు దృష్టిసారిస్తారు. అయితే గత ప్రభుత్వం జీవో 77 తీసుకువచ్చి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదు. గతంలో పీజీ విద్యార్థులకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు రీయింబర్స్‌మెంట్ చెల్లించేవారు. జగన్ ప్రభుత్వం పీజీ కోర్సులకు రీయింబర్స్‌మెంట్ కట్ చేసింది. ఫలితంగా డిగ్రీ చదివిన అనేక మంది పీజీ కోర్సుల్లో చేరడం లేదు. కొద్దిగా డబ్బున్న కుటుంబాల విద్యార్థులకు మాత్రమే ప్రస్తుతం పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

త్వరలో లోకేశ్‌తో ఆక్టా భేటీ

ఉమ్మడి జిల్లాలో ఇటీవల ఆక్టా(అఫ్లియేటెడ్ కాలేజెస్ టీచర్స్ అసోసియేషన్) నాయకులు త్వరలో విద్యామంత్రి లోకేశ్‌తో భేటీ కావాలని నిర్ణయించారు. డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్ అడ్మిషన్లు, జీవో 77, మేజర్, మైనర్ కోర్సులు గురించి యువగళం పాదయాత్రలో లోకేశ్‌కు సంఘ నాయకులు వివరించారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం గతంలో తమకు హామీ ఇచ్చిన లోకేశ్ విద్యాశాఖ మంత్రి కావడంతో ఆయన ఆయా అంశాలపై సానుకూలంగా స్పందిస్తారని, సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉందని ఆక్టా నాయకులు, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కొమ్మాలపాటి మోజేస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

కలెక్టర్లు బదిలీ

- గుంటూరుకు నాగలక్ష్మి
- బాపట్ల బాధ్యతలు జేసీ శ్రీధర్‌కు
- కర్నూలు జిల్లా కలెక్టర్‌గా రంజిత్‌బాషా
- జీఏడీలో రిపోర్టు చేయాలని వేణుగోపాల్‌రెడ్డికి ఆదేశం

గుంటూరు, బాపట్ల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు యంత్రాంగం ప్రక్షాళన మొదలుపెట్టారు. శనివారం పలు జిల్లాల కలెక్టర్లను మార్చారు. ఈ క్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు, బాపట్ల కలెక్టర్లను బదిలీ చేశారు. గుంటూరు జిల్లా నూతన కలెక్టర్‌గా ఎస్ నాగలక్ష్మి నియమితులు కాగా బాపట్ల జిల్లా కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌కు అప్పగించారు. బాపట్ల జిల్లాకు నూతన కలెక్టర్ నియామకమయ్యే వరకు ఈయనే కలెక్టర్‌గా విధులు నిర్వహించనున్నారు

గుంటూరు కలెక్టర్‌గా ఉన్న వేణుగోపాలరెడ్డికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయన్ను జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల జిల్లా కలెక్టర్‌గా ఉన్న రంజిత్‌బాషాను కర్నూలు జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన నాగలక్ష్మి గతంలో గుంటూరు నగరపాలకసంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. శనివారం రాత్రి జరిగిన బదిలీల్లో విజయనగరం కలెక్టర్‌గా ఉన్న నాగలక్ష్మిని గుంటూరు కలెక్టర్‌గా మార్చారు. ఇంచుమించు రెండేళ్లకుపైగా గుంటూరు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన వేణుగోపాల్‌రెడ్డికి పోస్టింగ్ దక్కలేదు. ఆయన్ను ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగంలో పోస్టింగ్ కోసం రిపోర్టు చేయాల్సిందిగా చీఫ్ సెక్రెటరి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా వేణుగోపాల్‌రెడ్డికి పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీపై ఉద్యోగ వర్గాల్లో పలు విధాలుగా చర్చ జరుగుతున్నది. వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన సీనియర్ ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా జీఏడీలోనే రిపోర్టు చేయాలని గతవారం ప్రభుత్వం ఆదేశించింది. వారికి ఇంతవరకు ఎలాంటి పోస్టింగ్‌లు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో వేణుగోపాల్‌రెడ్డికి పోస్టింగ్ ఇవ్వకపోవడానికి కారణాలు ఉన్నాయన్న చర్చ కూడా జరుగుతున్నది. అమరావతి రాజధానిలో ఆర్ 5 జోన్‌ని వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు పెద్దల ఆదేశాల మేరకు కలెక్టర్ హోదాలో దీనికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి లే అవుట్లను ఏర్పాటు చేయించారు. అలానే సీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశాల మేరకు రాజధాని భూసేకరణ నోటిఫికేషన్లను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పోస్టింగ్ ఇవ్వకపోవడానికి ఇవి కారణమై ఉండొచ్చన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

గుంటూరుతో అనుబంధం ఎక్కువ

సివిల్ సర్వెంట్‌గా గుంటూరుతో తనకు అనుబంధం ఎక్కువని జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన ఎస్ నాగలక్ష్మి తెలిపారు. శనివారం రాత్రి ఆమె ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. నగరపాలకసంస్థ కమి షనర్‌గా విధులు నిర్వహించిన జిల్లాకే కలెక్టర్‌గా నియామకం పొందడం సంతోషకరంగా ఉందన్నారు. కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ప్రజలు చూపిన ఆదరాభిమానాలు, ఉద్యోగులు, అధికారుల సహకారం మరువలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలను ఆచరణలో పెట్టడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రతీ సోమవారం క్రమం తప్పకుండా గ్రీవెన్స్ రిడ్రెసల్ కార్యక్రమానికి హాజరై ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

గుంటూరుపై నాగలక్ష్మికి అవగాహన..

తమిళనాడు రాష్ట్రానికి చెందిన నాగలక్ష్మి సెల్వరాజన్ గుంటూరు నగరపాలకసంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సమయంలో మంచి పేరు తెచ్చుకున్నారు. విధి నిర్వహణల్లో ముక్కుసూటిగా వ్యవహరించేవారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గేవారు కాదు. ఎక్కడా అధికార దర్పం ప్రదర్శించే వారు కాదు. కృష్ణానది పుష్కరాల సమయంలో కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఆ సమయంలో గుంటూరు నగరంలోకి అప్రోచ్ రోడ్లు అయిన జీఎన్‌టీ, ఏటుకూరు, పొన్నూరు, మంగళగిరి, నందివెలుగు రహదారుల అభివృద్ధికి కృషి చేశారు. రోడ్లను వెడల్పు చేయించి సెంట్రల్ డివైడర్ల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు చాలావరకు పరిష్కరించారు. గుంటగ్రౌండ్ రోడ్డు, డొంకరోడ్డు విస్తరణ పనులు కూడా ఆమె హయాంలోనే జరిగాయి. కీలకమైన ఏఈఎల్‌సీ స్థలాన్ని రోడ్డు విస్తరణ కోసం సేకరించగలిగారు. నగర సుందరీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టబోయే కలెక్టర్‌కు జిల్లాపై అవగాహన ఉన్న దృష్ట్యా పరిపాలన సులభతరం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

టీడీపీ పార్లమెంటరీ పార్టీ లీడర్‌గా.. లావు

- ఉమ్మడి గుంటూరు జిల్లాకు పదవుల పంట
- ఇప్పటికే కేంద్రమంత్రిగా పెమ్మసాని
- రాష్ట్ర కేబినెట్‌లో ముగ్గురికి చోటు
- ధూళిపాళ్ళకు ఖరారైన చీఫ్‌విప్ పోస్టు



గుంటూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతమైన ఉమ్మడి గుంటూరు జిల్లా పదవుల పంపకంలో అగ్రస్థానంలో నిలిచింది. కూటమిలో భాగంగా కేంద్ర కేబినెట్‌లో అనూహ్యంగా గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి తొలిసారి గెలిచిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు సహాయ మంత్రిగా చోటు దక్కిన విషయం తెలిసిందే. ఇదే జిల్లా పరిధిలోని నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి రెండో పర్యాయం గెలుపొందిన విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ ప్రెసిడెంట్ లావు శ్రీకృష్ణదేవరాయులుకు కీలక పదవిని కట్టబెట్టేందుకు అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఆయన్ను ఎన్నుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. త్వరలో జరిగే పార్లమెంటు సమావేశాల్లో నూతన ఎంపీల ప్రమాణ స్వీకారం అయిన తరువాత లావును పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకోనున్నారు. తాజా ఎన్నికలో గెలవడం ద్వారా లావు రెండో పర్యాయం లోక్‌సభలో అడుగు పెడుతున్నారు. గత ఎన్నికల్లో ఆయన వైసీపీ తరుపున గెలుపొందినప్పటికీ తన పంథాకు, విలువలకు భంగం కలగకుండా వ్యవహరించారు. వైసీపీ ప్రభుత్వం నుంచి తనకు ఎటువంటి సహకారం లభించనప్పటికీ నేరుగా కేంద్రమంత్రులతో పరిచయాలు పెట్టుకుని వారి సహకారంతో పల్నాడు ప్రాంతంలో అభివృద్ధి కోసం కృషి చేశారు. అయితే వైసీపీ భావజాలాలు ముఖ్యంగా ప్రత్యర్థుల పైనే కాకుండా వారి కుటుంబీకులను సైతం బూతులు తిట్టే సంప్రదాయం అదే పార్టీలో ఉన్న లావు జీర్ణించుకోలేకపోయారు. దీంతో ఆయన్ను పార్టీలో నుంచి పంపేందుకు పొమ్మనకుండా జగన్ పొగపెట్టాడు. సిట్టింగ్ ఎంపీగా ఉండి నియోజకవర్గ ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్న శ్రీకృష్ణదేవరాయలును అకారణంగా వలస పంపే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన వైసీపీలో కొనసాగను అని జగన్‌కు చెప్పి పార్టీకి రాజీనామా చేశారు. తదనంతరం టీడీపీ తరఫున నరసరావుపేట నుంచి పోటీ చేసే అవకాశం చంద్రబాబు కల్పించారు. రెండోసారి గెలుపొంది సీనియర్‌గా ఉండటమే కాకుండా పార్లమెంటులో గత ఐదేళ్లలో వివిధ అంశాలపై పలు మార్లు కూలంకషంగా చర్చించిన అనుభవాన్ని కూడా పరిగణలోకి తీసుకుని పార్లమెంటరీ పార్టీ నేతగా ఆయన్ను నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే రాష్ట్ర కేబినెట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎంపికైన ముగ్గురుకి చోటు దక్కటమే కాకుండా కీలకశాఖలు కూడా లభించాయి. అంతే కాకుండా పొన్నూరు నుంచి ఆరోసారి విజయం సాధించిన టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు కూడా చీఫ్‌విప్ పదవిని కట్టబెట్టేందుకు అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. రెండు, మూడు రోజుల్లో ఆయన నియామకాన్ని కూడా ప్రకటిస్తారు. కాగా అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ కీలక పదవులు లభించటంతో రాజధాని ప్రాంత వాసులు, ముఖ్యంగా అమరావతి కోసం భూములను త్యాగం చేసిన రైతులు సంబర పడిపోతున్నారు.

నకిలీలపై.. నిర్లక్ష్యం



విత్తనంపై.. పంట ఎదుగుదల, దిగుబడితో పాటు రైతన్న జీవితం ఆధారపడి ఉంటుంది. మంచి విత్తనం అయితే అధిక దిగుబడితో రైతు లబ్ధి పొందతాడు. అదే నకిలీదైతే పంట పండక రైతు ఆర్థికంగా చితికిపోయి అప్పుల పాలవుతాడు. కొందరైతే తనువు కూడా చాలిస్తాడు. ఇంతటి ప్రాధాన్యమైన విత్తనం విషయంలో కొందరు వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతుండగా వారికి కొందరు అధికారులు సహకరిస్తున్నారు. దీంతో మార్కెట్‌ను నకిలీ విత్తనాలు ముంచెత్తుతున్నాయి.

- విత్తన వ్యాపారులపై 6 ఏ కేసుతో సరి
- రైతులు నట్టేట మునిగినా కంటితుడుపు చర్యలే
- చిన్న కేసులేనని రెచ్చిపోతున్న అక్రమ వ్యాపారులు



గుంటూరు సిటీ, జూన్ 22: రైతుల జీవితాలతో ఆడుకునే నకిలీ విత్తనాల వ్యాపారులను కట్టడి చేసే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నకిలీ విత్తన వ్యాపారులపై కఠినమైన చర్యలు చేపట్టడంలేదు. వ్యాపారులు నకిలీ విత్తనాలతో రైతులను నట్టేట ముంచినా వారిపై కేవలం 6 ఏ కేసులతో సరి పెడుతున్నారు. ఎన్ని నకిలీ విత్తనాలు విక్రయించినా, ఎన్ని సార్లు పట్టుబడినా.. పెట్టేది ఆ చిన్న కేసు మాత్రమే కావడంతో కొందరు అక్రమ వ్యాపారులు రెచ్చిపోతున్నారన్న వాదన వినిపిస్తోంది.

ఎక్కడైనా అదే.. ఎవరైనా అదే

గత నెలలో గుంటూరు ఏటుకూరురోడ్డులోని సింధూరి సీడ్స్‌లో నకిలీ మిరప విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలో ప్యాక్ చేసి అమ్మాల్సిన విత్తనాలను ఇక్కడ ప్యాక్ చేస్తుండగా స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. రాజాగారి తోటలో కూడా శారదా పరమేశ్వరి సీడ్స్ నుంచి కాలం చెల్లిన 14.25 కేజీల విత్తనాలు వ్యవసాయ శాఖ అధికారులు పట్టుకున్నారు. అక్కడా అదే కేసు నమోదు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మరికొన్ని చోట్ల ఇదే రీతిలో విజిలెన్స్ అధికారులు నకిలీ విత్తనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అయితే వారి పై పస లేని 6ఏ కేసు మాత్రమే పెట్టారు. అంటే రైతు నిండా మునిగే విత్తనం విషయంలో అధికారులు ఎంతటి నిర్లక్ష్యంగా ఉన్నారో తెలుసుకోవచ్చు.

పోయేది ఏమీ లేదు...

ది ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ 1955లోని సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేయటం వల్ల పెద్దగా జరిగే నష్టం ఏమీ ఉండదు. ఈ చట్ట ప్రకారం విత్తనాలను సీజ్ చేస్తారు. విచారణ తర్వాత మహా అయితే రూ.500 జరిమానా, 5 నెలలు జైలు శిక్ష మాత్రమే పడుతుంది. కొన్ని సందర్భాల్లో సీజ్ చేసిన వాటిని జప్తు చేస్తారు. ఇటువంటి బలహీనమైన కేసు వల్ల నకిలీ విత్తనాలు వ్యాపారులు నేరం మళ్లీ మళ్లీ చేసేందుకు వెనుకాడటం లేదు. విజిలెన్స్ రికార్డుల ప్రకారం చూస్తే నకిలీ విత్తనాలు పదే పదే పాత వారి వద్దే దొరుకుతున్నట్లు అర్థమవుతుంది. ఒక ఏడాది భాగస్వాములు మారినా మళ్లీ అక్కడే నకిలీ విత్తనాలు పట్టుపడుతూ ఉండటం గమనార్హం. 6ఏ కేసు వల్లే కొందరు వ్యాపారులు ఏ విధమైన అనుమతి లేకుండా పక్క రాష్ట్రాల నుంచి తీసుకుని వచ్చి నిర్భయంగా అమ్ముతున్నట్లు తెలుస్తోంది.

మిగిలిన శాఖల సహకారం కరువే..

నకిలీ విత్తనాల కేసుల విషయంలో పోలీసు శాఖ సహకారం కరువైనట్లు కనిపిస్తుంది. విత్తనాలు పట్టుకున్న తర్వాత కేసు నమోదు చేయడానికి వ్యవసాయ శాఖ పోలీసు స్టేషన్‌లో తప్పన్సు చేయాల్సి వస్తుంది. కేసు నమోదు నుంచి కోర్టుకు వెళ్లే వరకు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వ్యవసాయ అధికారులు ఆవేదన చెందుతున్నారు. ఆ తర్వాత కూడా కేసు నిరూపణ కొరకు ఇబ్బందులు ఎదురైనా నకిలీ విత్తనాల వ్యాపారులకు శిక్ష పడేలా చేస్తున్నామని అంటున్నారు. మిగిలిన శాఖల సమన్వయం, సహకారం ఉంటే నకిలీ విత్తనాలు వ్యాపారుల ఆట కట్టించటం పెద్ద సమస్య కాదనేది కొందరి అభిప్రాయం.

అప్పట్లో వణుకు...

కాంతిలాల్ దండే ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ గా ఉన్నప్పుడు నకిలీ విత్తనాల వ్యాపారులపై ఉక్కుపాదం మోపారు. అప్పట్లో పదే పదే నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుపడిన వారిపై, కొన్ని కంపెనీలపై పీడీ యాక్టు పెట్టించారు. అటువంటి కఠిన చర్యలు ఉండటం వల్ల చాలామంది అప్పట్లో నకిలీల వైపు చూసేందుకు భయపడ్డారు. ఈ కేసులో బెయిల్ కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో పక్క రాష్ట్రాల నుంచి విత్తనాలు తెచ్చి అమ్మే సాహసం వ్యాపారులు చెయ్యలేదు.

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

- ఓపిగ్గా వినతులు స్వీకరిస్తున్న నారా లోకేశ్

తాడేపల్లి, మంగళగిరి, జూన్ 22: మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు నియోజకవర్గం నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వేకువజాము నుంచే ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసం వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను లోకేశ్ ఎంతో ఓపికగా వింటూ వాటిని సంబంధిత శాఖలకు పంపించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశిస్తున్నారు. శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వైసీపీ నేతల భూకబ్జాలకు సంబంధించి అనేక ఫిర్యాదులు అందాయి. వైసీపీ ప్రభుత్వ అండతో చావలి ఉల్లయ్య తన 16.5 సెంట్ల స్థలాన్ని కబ్జా చేశారని, తిరిగి ఇప్పించాలని మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన ఆలా సాంబశివరావు కోరారు. ఉండవల్లి- రేవేంద్రపాడు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, జగన్ నివాసం ఎదురుగా ఉన్న రహదారిలో వాహనాలను అడ్డుపెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వడ్డేశ్వరం, ఉండవల్లి, తాడేపల్లి, కుంచనపల్లి, రేవేంద్రపాడు వాసులు విన్నవించారు. మంగళగిరి మండలం నిడమర్రులో కొందరు వ్యక్తులు మద్యం అమ్మకాలకు విద్యార్థులను వినియోగిస్తున్నారని, దీనిని అరికట్టాలని గ్రామస్తులు విన్నవించారు. అమరావతి కోసం భూములిచ్చిన తమకు రెండేళ్లుగా కౌలు రావడంలేదని నిడమర్రుకు చెందిన ఉన్నం నాగరాజు తెలిపారు. ఆయుష్ పారామెడికల్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏపీడబ్ల్యూ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మద్యం దుకాణాల్లో అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న 12వేల మందికి ఆయా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.



దివ్యాంగుడు నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న లోకేశ్



7లో..

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రేంజ్ ఐజీ త్రిపాఠి

పొన్నూరు పురపాలక సంఘం, పొన్నూరు

ఆర్.ఓ.సి.నెం.1755/2015/జి1 తేది.22.06.2024

ప్రకటన

ప్రభుత్వ ఉత్తర్వులు నెం. 650 యం.ఏ & యు.డి, తేది. 27-10-1993 మాస్టర్ ప్లాను ప్రకారము, పొన్నూరు పురపాలక సంఘ పరిధిలో జి.బి.సి. రోడ్డును అభివృద్ధి చేయుటలో భాగంగా రూరల్ పోలీస్ స్టేషన్ నుండి కొప్పాక వెంకయ్య కూరగాయల మార్కెట్ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ జరిగినది. సదరు రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయిన యాజమానుదారులకు TDR (Trans ferable Development Right) బాండ్లు జారీ చేయు విషయము పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంటు వారు మెమొ నెం. 2250050/M2/2023, తేది.30.10.2023 నందు Scrutiny కమిటీని ఏర్పాటు చేసియున్నారు. సదరు Scrutiny కమిటీ వారు Scrutiny చేసిన స్థల యాజమానుదారుల వివరములు ఈ క్రింది విధముగా వున్నవి.

S.No.	Structure Number	Name of the Building (or) Site Owner	Regististered Deed Number	Extent of Land effected	Door Number	Survey Number
1.	4	Sri. Mudraboina Subbulu	2807/2005	14.03	24-1-60	380/5
2.	5	Sri. Pallapotu Lakshmi Narasimha Swami	1423/1997	13.82	24-01-59/1	380/5
3.	5A	Sri. Pallapotu Lakshmi Narasimha Swami	1492/2015	14.89	24-01-59/1	380/5
4.	6A	Potti Venkateswa Rao	3946/2021	18.72	24-01-59/A 24-01-59/B	380/5
5.	12	Nalam Raghava Rao	1795/2014	34.84	24-01-53	380/5
6.	21	Annavarau Venkata Narasimha Rao	774/2019	3.83	24-01-40	380/5
7.	23	Chunduru Venkata Lakshmi Kumari	1376/1974	100.01	24-01-36, 24-01-37	380/5
8.	24	Vutukuri Srirama Chandra Murthy	1013/1985	3.25	24-01-35	380/5
9.	26	Kotha Rama Krishna	346/1997	0.6	24-01-33	380/5
10.	27	Sanka Vijaya Prasad	345/1997	2.4	24-01-32	380/5
11.	32	Garlapati Nagaraju Guptha	42/1982	5.01	24-01-28	380/5

పై తెల్పిన వారి యొక్క డాక్యుమెంట్స్‌ను Scrutiny కమిటీ వారు తేది. 21.06.2024న Scrutiny చేసి టి.డి.ఆర్. బాండ్లు మంజూరు చేయుటకు గాను ఆమోదము తెలిపియున్నారు. కావున పై తెలిపిన వారికి టి.డి.ఆర్. బాండ్లు మంజూరు చేయు విషయములో ఏమైనా అభ్యంతరములు వున్న యెడల 15 రోజులలోపు పొన్నూరు పురపాలక సంఘ కార్యాలయమునకు దాఖలు చేయవలెనని తెలియచేయడమైనది.

సం/- కమీషనరు,
పొన్నూరు పురపాలక సంఘం.

ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలు.. గడువు నిర్దేశించుకొని పూర్తి చేస్తాం

- ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని
- నేడు గుంటూరు యూజీడీపై సమీక్ష



కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నిర్వహించిన సమీక్షకు హాజరైన కలెక్టర్, జేసీ, రైల్వే డీఆర్‌ఎం

గుంటూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ఐదేళ్ల నుంచి రైల్వే ప్రాజెక్టుల్లో ఏ ఒక్కటి ముందుకు పోలేదు. వాటన్నింటిని పట్టాలెక్కించి గడువు తేదీని నిర్దేశించుకొని పూర్తిచేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక రోడ్లు, భవనాల అతిథిగృహంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ ఇతర అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణంపై ప్రధానంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులు సాధ్యమైనంత త్వరలో పూర్తిచేసేలా కృషి చేస్తామని తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలోని మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డు, పెదపలకలూరు, మంగళగిరి, నగరంలోని శంకర్‌విలాస్ సెంటరు, సీతానగర్, నెహ్రూనగర్, సంజీవయ్యనగర్ రైల్వేగేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జ్, శ్యామలనగర్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణాల అనుమతుల వివరాలు, నందివెలుగు రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనుల వివరాలను అధికారులు కేంద్రమంత్రికి వివరించారు. పనుల వారీగా అనుమతుల మంజూరుకు రైల్వేశాఖ, ఆర్‌అండ్‌బీ, స్థానిక సంస్థలు చేపట్టాల్సిన చర్యలపై కేంద్రమంత్రి సమీక్షించి అధికారులకు సూచనలు జారీ చేశారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును తెనాలిలో నిలిపి ప్రయాణికులకు సౌకర్యం కల్పించేందుకు రైల్వే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని డివిజనల్ రైల్వే అధికారులను ఆదేశించారు. గుంటూరు నుంచి బెంగళూరుకు పగటిపూట రైల్వే సౌలభ్యం కల్పించే అంశంపై సమీక్షించారు. మంగళగిరి నుంచి తెనాలికి రెండు లైన్ల రోడ్డుకు ప్రతిపాదనలు తయారుచేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

నగరంలోని శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జి ఆధునికీకరణకు ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలపై కూడా సమావేశంలో సమీక్షించారు. జిల్లాలో పదిహేను వరకు రైల్వేబ్రిడ్జ్‌లు రూ.1000కోట్ల నుంచి రూ.2000కోట్ల పనులకు సంబంధించి డీపీఆర్ రూపొందించినవి, డీపీఆర్ రూపొందించాల్సిన ఆర్వోబీ, ఆర్‌యూబీ ప్రాజెక్టులు, ప్రస్తుతం అవి రైల్వేశాఖలో ఎక్కడ పెండింగ్‌లో ఉన్నాయో తదితర వివరాలను, వాటిని పూర్తిచేయటానికి కాలపరిమితి నిర్దేశించటం జరిగిందన్నారు. బ్రిడ్జ్‌లు, రహదారుల నిర్మాణం వలన ఓట్లు రావనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలుగా వీటి గురించి పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం ప్రకారం రానున్న పార్లమెంట్ సమావేశంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తామన్నారు.

కాగా ఆదివారం గుంటూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల స్థితిగతులపై మునిసిపల్, ప్రజారోగ్య తదితర శాఖల అధికారులతో కేంద్రమంత్రి ఐబీలో సమీక్షించాలని నిర్ణయించారు. అలానే సాయంత్రం జీజీహెచ్‌ని సందర్శించి అక్కడ సమస్యలు తెలుసుకొని చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష చేస్తారు.

తొలుత కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకర్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, సీపీవో శేషశ్రీ, గుంటూరు నగరపాలక సంస్థ ఎస్ఈ శ్యాం ప్రసాద్, సిటీ ప్లానర్ ప్రదీప్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఐబీలో కోలాహలం

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వివిధ ప్రభుత్వ శాఖలతో సమీక్షలు ఏర్పాటు చేయడంతో కలెక్టర్, జేసీ, రైల్వే డీఆర్‌ఎం వంటి ఉన్నతాధికారులతో పాటు ఇంజనీరింగ్ అధికారులు హాజరయ్యారు. అలానే కూటమి నేతలు కూడా వచ్చారు. తెలుగుదేశం పార్టీ నుంచి చిట్టాబత్తిన శ్రీనివాసరావు, నాయుడు ఓంకార్, అడకా శ్రీనివాసరావు, మన్నవ వంశీ, బీజేపీ నాయకులు, జనసేన ప్రత్తిపాడు సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, ఎంఆర్‌పీఎస్, మాల మహానాడు నాయకులు, విశ్రాంత డీఆర్‌వో కొసనా నాగబాబు తదితరులు హాజరయ్యారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- జిల్లాలో ప్రగతి పనులపై ఎంపీ లావు సమీక్ష



సమావేశంలో ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ

నరసరావుపేట, జూన్22: జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న ఐదు జాతీయ రహదారులు నిర్మాణం పూర్తికి అవసరమైన నిధుల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పంపేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాలో కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన ప్రగతిపనుల పురోగతిపై ఎంపీ లావు సమీక్షించారు. ఐదు జాతీయ రహదరులకు సంబంధించి భూసేకరణ, నిధుల లభ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో సదరు ప్రగతి పనులపై చర్చిస్తానని చెప్పారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యాలయం వరకు రహదారినిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ఎత్తిపోతల పథకాలు ఎన్ని ఉన్నాయి, ఎన్ని పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి వివరాలు సేకరించారు. అవసరమైన నిధులు కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జలజీవన్ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని, అవసరమైన నిధులు కొరకు ప్రతిపాదనలు త్వరితగతిన రెడీ చేయాలన్నారు. గుంటూరు-బీబీనగర్ రైల్వేపనులపై సమీక్షించారు. వీవర్స్ షెడ్స్ ఏర్పాటుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. కార్యక్రమంలో జేసీ ఏ శ్యాంప్రసాద్, డీఆర్వో వినాయకంరెడ్డి, ఆర్డీవో పి.సరోజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సభా, సంప్రదాయాలను
జగన్ మంట కలిపారు

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూన్ 22: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభా సంప్రదాయాలను మంట కలిపారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అన్ని పార్టీలు కలిసి లాంఛనంగా అయ్యన్నపాత్రుడుని స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టడం సంప్రదాయం అన్నారు. సభా విలువలను మంటగలిపి పులివెందుల పర్యటన సాకుతో సభకి డుమ్మాకొట్టి తప్పించుకోవడం సిగ్గుచేటన్నారు. అతనితో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు పదిమందిని నిలువరించడం జగన్‌రెడ్డి తనలోని శాడిస్ట్ చర్యను బయటపెట్టుకున్నారన్నారు. ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌రెడ్డిని అగౌరవపరచిన ప్రభుత్వమని బ్యానర్ ఐటమ్‌గా తన నీలిమీడియాలో రాశారన్నారు. ఒక సాధారణ ఎమ్మెల్యేని మాజీ ముఖ్యమంత్రి అనే గౌరవంతో అతని వాహనాన్ని సమావేశ మందిరం వరకు అనుమతించడం, మంత్రుల తరువాత ప్రమాణ స్వీకారం చేయించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తప్పా? అన్నారు. అగౌరవ పరచాలి అనుకుంటే జగన్‌రెడ్డి ఎప్పుడు ప్రమాణం చేయాలో మీ రోతపత్రిక రాస్తే బాగుంటుందని హితవు పలికారు. కనీసం తనతో పాటు గెలిచిన పదిమంది ఎమ్మెల్యేల ప్రమాణం కూడా చూడకుండా వెళ్లిపోవడం సభా సంప్రదాయాలను మంట కలపడం కాదా అనేది ఆలోచించుకోవాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

సమన్వయంతో పని చేయండి

- ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్

కొల్లిపర, జూన్ 22: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచేవిధంగా కృషి చేయాలని ఏపీ ఆహార పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో చేసిన అభివృద్ధి పనులు ఏ స్థాయిలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీలను నేరవేర్చే దిశగా ఉన్నారన్నారు. జూలై 1వతేది నుంచి పెన్షన్ పెంపుదల చేసి అర్హులందరికి అందిస్తామన్నారు.తొలుత నాదెండ్ల మనోహర్‌ను అధికారులు ఘనంగా సన్మానించారు. వికలాంగుల సంక్షేమం కోసం భీమవరపు వేణుగోపాల రెడ్డి రూ.25వేల చెక్కును మంత్రి మనోహర్‌కు అందజేశారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయం.. వ్యాపారికి న్యాయం..

తెనాలి అర్బన్, జూన్ 22: రాష్ట్రంలో కూటమి ఘన విజయం సాధించడంతో వ్యాపారికి న్యాయం చేకూరింది. రాష్ట్ర వ్యాప్తంగా అధికార జులుం ప్రదర్శించిన వైసీపీ నేతలు తెనాలిలో కూడా అక్కడక్కడ తమ ప్రతాపం చూపారు. బోసు రోడ్డు నుంచి మూర్తి కొండయ్య వీధికి వెళ్లే మార్గంలో చిన్న భవనంలో నూనె రామకృష్ణ అనే వ్యక్తి దుస్తుల దుకాణం నడుపుకుని జీవిస్తున్నాడు. దుకాణం వెనుక వైసీపీ నేతగా ఉన్న ఓ టైలర్ ఏడాది క్రితం రాత్రికి రాత్రే దుకాణాన్ని జేసీబీతో తొలగించి ఆక్రమించేశాడు. తన ఇంటిలోకి వెళ్లడానికి ఈ స్థలాన్ని అనువుగా మార్చుకున్నాడు. ఆర్యవైశ్య సంఘాలు, టీడీపీ నాయకులు, ఈ దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండించినప్పటికీ న్యాయం చేయాలని వ్యాపారి మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు వ్యాపారికి అండగా నిలబడ్డారు. దీంతో రామకృష్ణ తన స్థలం స్వాధీనం చేసుకుని గోడ కట్టి తలుపు ఏర్పాటుచేసుకున్నాడు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కూడా కౌన్సిలర్ దేసు యుగంధర్ ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే అతనిపై కూడా వైసీపీ కౌన్సిలర్లు దాడికి తెగబడ్డారు. ఈ అంశంలో అటు కౌన్సిల్ చైర్మన్‌గాని పోలీసులుగాని పట్టించుకోలేదు. ఈ అంశాన్ని కూడా తెరపైకి తెచ్చి నిందితులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వ్యాపారి స్థలాన్ని స్వాధీనం చేసుకుని చేసిన నిర్మాణం

విజ్ఞాన్స్ యూనివర్సిటీ, సీడాక్‌ల మధ్య ఎంవోయూ

గుంటూరు(విద్య), జూన్ 22: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, బెంగుళూరులోని సీడాక్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్) ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని శనివారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. సీడాక్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డాక్టర్ ఎస్‌డీ సుదర్శన్‌తో వర్సిటీ వీసీ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన విద్యార్థులకు, అధ్యాపకులకు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో ప్రత్యేక శిక్షణ లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌డీ సుదర్శన్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీడాక్ శాస్త్రవేత్త హరిబాబు, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న విజ్ఞాన్ వీసీ ఆచార్య నాగభూషన్ తదితరులు


అనంతవరం నుంచి గ్రావెల్ మాయం

తుళ్లూరు, జూన్ 22: అనంతవరం కొండ నుంచి రాత్రికి రాత్రిళ్ల గ్రావెల్ మాయం అవుతోంది. ఒక్కోసారి పట్టపగలు కూడా తోలుకు పోతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. కొండ వెనక నుంచి గ్రావెల్ గుట్టు చప్పుడు కాకుండా తరలిపోతుంది. కర్లపాలెం మీదుగా గ్రావెల్ లారీలు వెళుతున్నట్టు తెలుస్తుంది. ఎటువంటి అనుమతులు లేకపోయినా గ్రావెల్ పోతుండటం గమనార్హం. ప్రైవేటు వెంచర్లకు ఈ గ్రావెల్ వెళుతున్నట్టు సమాచారం.

లెవల్ క్రాసింగ్ గేటు మూసివేత

తాడేపల్లి, జూన్ 22: తాడేపల్లి మండలం ఇప్పటం మంగళగిరి మధ్య రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్‌ను రైల్వే బెడ్ ఏర్పాటు నిమిత్తం తాత్కాలికంగా ఈ నెల 24 నుంచి 27వరకు మూసివేస్తున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. పెదవడ్లపూడి, కృష్ణాకెనాల్ జంక్షన్ మధ్య మూడవ రైల్వే బెడ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు జంక్షన్ల మధ్య వున్న ఈ లెవల్ క్రాస్ గేట్ తాత్కాలికంగా నిలిపివేస్తునట్టు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మంగళగిరి ఇప్పటం లెవల్ క్రాసింగ్ గేట్ (305) మూసివేయబడుతుందని ఈ ప్రాంతం గుండా రాకపోకలు సాగించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన కోటగిరి రాజా

యడ్లపాడు, జూన్ 22: పదహారో నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు నక్కవాగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన కోటగిరి రాజ(25) శనివారం గుంటూరుకు వచ్చి అనంతరం తిరిగి సాయంత్రం గ్రామానికి బయలుదేరాడు. యడ్లపాడు నక్కవాగు సమీపంలోకి రాగానే అదే మార్గంలో వెళుతున్న కారు గేదెల్ని తప్పించే క్రమంలో ప్రక్కకు రావడంతో బైక్‌ను ఢీకొట్టింది. దీనితో రాజ క్రింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన యువకుడిని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రాజ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

నేడు కనకదుర్గ సన్నిధికి రాజధాని రైతులు

తుళ్లూరు, జూన్22: రాజధాని మహిళలు, రైతులు, రైతు కూలీలు ఆదివారం కాలినడకన విజయవాడ కనక దుర్గమ్మ అమ్మవారి సన్నిధికి మొక్కులు తీర్చుకోవటానికి వెళ్లనున్నారు. తెల్లవారుజామున 4గంటలకు పొంగళ్లు పెట్టి తుళ్లూరు రైతు దీక్ష శిబిరం నుంచి బయలుదేరతారు. కూటమి విజయం సాధించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటంతో అమరావతి ఊపిరి పీల్చుకుంది. పూర్వ వైభవం రావటంతో అమ్మవారికి ఆగిన మొక్కును చెల్లించుకుంటున్నామని మహిళలు పేర్కొన్నారు. 2020 జనవరి 10న తుళ్లూరు నుంచి విజయవాడ కనకదర్గమ్మ సన్నిధికి బయలుదేరిన మహిళలను పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

బీసీలను అందలం ఎక్కించింది చంద్రబాబే

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి


ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో బీసీలను గౌరవించి, అందలం ఎక్కించేది చంద్రబాబు మాత్రమేనని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాదవి అన్నారు. రెండో రోజు సమావేశాలకు గళ్ళా మాధవి హాజరయ్యారు. స్పీకరుగా ఏకగ్రీవంగా ఎన్నికైన అయ్యన్న పాత్రుడుకు ఆమె సభలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు, కింజారపు రామ్మోహన్‌నాయుడులకు అతి కీలక పదవులను అప్పగించి బీసీల గౌరవాన్ని ఉన్నత స్థాయిలో నిలబెట్టిన ఘనత చంద్రబాబుదే అని ఆమె చెప్పారు. తొలిసారిగా సభలో అడుగుపెట్టిన తనలాంటి వారికి అధ్యక్ష స్థానంలో కూర్చున్న అయ్యన్న పాత్రుడు రాజకీయ అనుభవం మార్గదర్శకంగా పని చేస్తుందని అన్నారు. తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతైన అయ్యన్న ఎన్టీఆర్ కేబినెట్‌లోనూ మంత్రిగా పని చేశారని, ఏడుసార్లు ఎమ్మెల్యేగా పని చేసి ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం చేసారని గళ్ళా మాధవి కొనియాడారు. వైసీపీ ప్రభుత్వం అయ్యన్నను ఎంతో ఇబ్బందులు పెట్టినా జగన్‌రెడ్డి లాంటి నియంతకు ఆయన తల వంచలేదన్నారు. పోరాట వీరులకు అందలం ఎక్కించే బాధ్యత తెలుగుదేశం పార్టీకే ఉంటుందని గళ్ళా మాధవి తెలిపారు.

ముస్లిం మైనారిటీలకు స్వర్ణ యుగం మొదలైంది

● తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు, జూన్ 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో మైనారిటీలకు స్వర్ణ యుగం మొదలైందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని ఎల్బీ మార్కెట్ (మాయాబజార్)లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాయాబజార్ ఓల్డ్ స్పేర్ పార్ట్స్ డిస్పోజల్ మార్కెట్, సభ్యులు, మెకానిక్‌లతో ముచ్చటించారు. ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారి మాయాబజార్‌కు వెళ్లిన ఆయనకు ఎల్బీ మార్కెట్ సభ్యులు టపాసులు కాల్చి శాలువాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నసీర్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మైనారిటీలకు ఆర్థికంగా అండగా నిలబడేందుకు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించి చంద్రబాబు మైనార్టీలను ఆర్థికంగా నిలబెట్టారన్నారు. మళ్లీ మైనారిటీలకు గత వైభవం తీసుకొచ్చి బలోపేతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హాజీ షౌకత్, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, ఆరిఫ్, బేరింగ్ ఖాజా, జుబేర్, హిదాహితుల్లా, సమ, బాజీ, డిస్పోజల్ భాష, మీటర్, ఖుద్దూస్ నూరి, కొనకళ్ళ సత్యం, బాజీ, అన్వర్, కలాం, దయారత్నం తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నసీర్‌ను సన్మానిస్తున్న మాయాబజార్ నేతలు

వైభవంగా శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జూన్ 22 : స్థానిక మల్లారెడ్డినగర్, శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో ఎంకేఆర్ అయ్యప్ప స్వామి ఫౌండేషన్, ఆలయ కమిటీ ఛైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేది వరకు జరిగే శ్రీ ధర్మ శాస్త అయ్యప్ప స్వామి 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం గోపూజ, కలశ ఆరాధన, గణపతి పూజ, అభిషేకాలు ఆలయ అర్చకులు కే.శివకుమార శర్మ, కే.చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం శ్రీ గణపతి హోమం, ధ్వజారోహణం అగ్ని ప్రతిష్టాపన నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


గణపతి పూజ నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న దంపతులు

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), జూన్ 22 : స్థానిక ఎస్వీఎన్ కాలనీ శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం విశ్వక్సే నారాధన, పుణ్యాహం, అగ్నీ ధ్యానం, నిత్య హోమం, శ్రీ వెంకటేశ్వర మూల మంత్ర హోమం తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం చండీయాగం సువాసిని పూజ భక్తి ప్రపత్తులతో గావించారు. ఉపన్యాస భారతి విశ్రాంత ఉపాధ్యాయిని ఎంవీ సత్యవతిచే లలితా సహస్రనామం జరిగింది. సాయంత్రం వేళలో స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అధ్యక్షుడు వట్టికూటి పూర్ణచంద్రరావు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమాలను అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, కార్యదర్శి నల్లమోతు వెంకటరత్తయ్య, కోశాధికారి పుచ్చ వెంకట మల్లేశ్వర్, ఉపాధ్యక్షులు పావులూరి కిషోర్, సంయుక్త కార్యదర్శి ఇమ్మడి శ్రీనివాసరావు, నైషధం శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు.


స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న భక్తులు

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్‌కు జనచైతన్య విరాళం

గుంటూరు, జూన్ 22 : హైదరాబాద్‌లోనున్న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ 24వ వార్షికోత్సవం సందర్భంగా హాస్పటల్‌కు జనచైతన్య హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ మాదల సుధాకర్ తరుపున ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ మాదల శ్రీరామ్‌భాస్కర్ హాజరై రూ.25 లక్షల చెక్కును అందజేశారు. ముఖ్య అతిధులుగా హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ ట్రస్టీ, ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ, నామా నాగేశ్వరరావు, మతుకుమిల్లి భరత్ తదితరులు మాదల శ్రీరామ్‌భాస్కర్‌కు జ్ఞాపికను అందజే సి అభినందనలు తెలిపారు.



ఈడి శ్రీరామ్‌భాస్కర్‌ను జ్ఞాపికతో అభినందిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, హాస్పటల్ ఛైర్మన్ బాలకృష్ణ తదితరులు

సికింద్రాబాద్-సంత్రగచి స్పెషల్ ట్రైన్ ఎస్ఎల్ఆర్ ప్లాట్-టైర్

● నల్గొండ - నడికుడి మధ్యన ఘటన
● నడికుడి రైల్వేస్టేషన్‌లో నిలిపేసిన సిబ్బంది
● ట్రాక్ ఏమైనా దెబ్బతిన్నదా అనే దానిపై సూక్ష్మ పరిశీలన
● పలు రైళ్ల రాకపోకలు ఆలస్యం

గుంటూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ శనివారం సికింద్రాబాద్ - సంత్రగచి మధ్యన గుంటూరు డివిజన్ మీదగా ప్రయాణించే స్పెషల్ ట్రైన్ ఎస్ఎల్ఆర్ భోగీ ఫ్లాట్-టైర్ అయింది. నల్గొండ-నడికుడి రైల్వే స్టేషన్ల మధ్యన ఈ సంఘటన చోటు చేసుకొన్నట్లు రైల్వేవర్గాలు గుర్తించాయి. ఈ సెక్షన్‌లో పలు స్టేషన్ల వద్ద సిబ్బంది ఎస్ఎల్ఆర్ భోగీ నుంచి వింత శబ్దం రావడాన్ని గమనించి తదుపరి స్టేషన్‌మాస్టర్‌కు సమాచారం అందించారు. ఈ రైలు గార్డు కూడా కిందికి దిగి చూసి అంతా బానే ఉందని చెప్పడంతో నడికుడి వరకు రైలుని నడిపారు. నడికుడిలో సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం ఎస్ఎల్ఆర్ భోగీకి సంబంధించిన ఒక వీల్(చక్రం) అరిగిపోయి ఫ్లాట్‌టైర్ అయినట్లు గుర్తించారు. ఆ భోగీని తొలగిస్తే తప్పా క్లియరెన్స్ ఇవ్వలేమని చెప్పారు. ఈ కారణంగా ఆ రైలు దాదాపుగా నాలుగు గంటల పాటు సెక్షన్‌లో నిలిపేశారు. దీని ప్రభావం ఇతర రైళ్లపై పడటంతో అవి గంటకు పైగా ఆలస్యంగా గమ్యస్థానాలకు చేరాయి.

నల్గొండ-నడికుడి రైల్వేసెక్షన్‌లో శనివారం పెద్ద ప్రమాదమే తప్పింది. సికింద్రాబాద్ - సంత్రగచి స్పెషల్ ట్రైన్ ఎస్ఎల్ఆర్ భోగీకి సంబంధించి ఒక చక్రం ఫ్లాట్‌టైర్ అయినప్పటికీ ఆ రైలు గార్డు నిర్లక్ష్యంగా వ్యవహరించి ముందుకు నడిపించారు. రైలు భోగీ చక్రం గుండ్రంగా ఉండి ప్రయాణిస్తేనే ట్రాక్‌కు ఏమి కాదు. ఫ్లాట్‌టైర్ అయితే మాత్రం అక్కడక్కడ పగుళ్లు ఇచ్చే ప్రమాదం ఉంది. వాటిల్లో కొన్ని పైకి కనిపించొచ్చు. మరికొన్ని కనిపించవు. ఆ కనిపించని పగుళ్లను ప్రత్యేక పరికరాల ద్వారా గుర్తించి దెబ్బతిన్న వరకు ట్రాక్‌ని మార్చాలి. లేకుంటే రైళ్లు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించినప్పుడు విరిగిపోయి ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉన్నది. దాదాపుగా 80 కిలోమీటర్ల దూరం మేరకు సంత్రగచి స్పెషల్ ట్రైన్ ఫ్లాట్ టైర్ అయి ప్రయాణించింది. దీనిని పరిగణనలోకి తీసుకొన్న రైల్వే అధికారులు ఆ సెక్షన్‌లో శనివారం రైళ్ల వేగాన్ని తగ్గించి నడిపారు. ఈ కారణంగా శబరి, రేపల్లె, ఫలక్‌నుమా, పల్నాడు, విశాఖ, చెన్నై, నారాయణాద్రి, వందేభారత్, ఇంటర్‌సిటీ తదితర రైళ్ల వేగం తగ్గించి నడిపారు. ఈ కారణంగా వాటిల్లో చాలా రైళ్లు గంటకు పైగా ఆలస్యమయ్యాయి.

రైల్వే గార్డుపై చర్యకు డీఆర్ఎం సిఫార్సు

సికింద్రాబాద్ - సంత్రగచి స్పెషల్ ట్రైన్‌కు గార్డుగా విజయవాడకు చెందిన ఉద్యోగి శనివారం విధులు నిర్వహించారు. ఒకపక్క సిబ్బంది చెబుతున్నా రైలుని నడికుడి వరకు నడిపేలా క్లియరెన్స్ ఇచ్చినందుకు అతనిపై చర్యలు తీసుకోవాలని డీఆర్ఎం ఎం.రామకృష్ణ విజయవాడ డివిజన్ అధికారులకు సిఫార్సు చేసినట్లు తెలిసింది.

స్కానింగ్ సెంటర్స్ ప్రోగ్రాం ఆఫీసర్లు తనిఖీ చేయాలి

● కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆదేశం

గుంటూరు సిటీ, జూన్ 22 : ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అయ్యే కొత్త స్కానింగ్ సెంటర్స్, రెన్యువల్ స్కానింగ్ సెంటర్లను తప్పనిసరిగా ప్రోగ్రాం ఆఫీసర్లు సందర్శించి తనిఖీ చేయాలని, చట్టాన్ని ఉల్లంఘించిన కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన శనివారం గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై డిస్ట్రిక్ లెవల్ మల్టీ మెంబర్ అప్రొప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 283 గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షా కేంద్రాలు ఉన్నాయని, వాటిలో నాలుగు రెన్యువల్ రిజిస్ట్రేషన్ కొరకు, 12 మాడిఫికేషన్ కొరకు, రెండు క్యాన్సిలేషన్ కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. కొత్తగా తొమ్మిది స్కానింగ్ సెంటర్లు రిజిస్ట్రేషన్ చేసుకొన్నారని, వాటిని కమిటీ సభ్యులు, ప్రోగ్రాం ఆఫీసర్లు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మేల్, ఫిమేల్ రేషియో (1000 : 952) ఎక్కువగా నమోదైన తెనాలి డివిజన్‌లోని 25 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందని, సదరు ఆపరేషన్‌లో ఉల్లంఘనలు జరిగినట్లు నిర్ధారణ కాలేదని కలెక్టర్‌కు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ విజయలక్ష్మి వివరించారు. కార్యక్ర మంలో ఎన్‌జీఓ ఐద్వా తరపున ఎల్.అరుణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

నైపర్‌లో ర్యాంకులు సాధించిన చిప్స్ విద్యార్థులు

గుంటూరు(విద్య), జూన్ 22 : స్థానిక చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మా స్యూటికల్ సైన్సెస్(చిప్స్) విద్యార్థులు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్)లో ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు ఆరు వేల మంది ఫార్మసీ విద్యార్థులు ఈ పోటీ పరీక్షకు హాజరుకాగా తమ కళాశాలకు చెందిన బీ ఫార్మసీ విద్యార్థిని డి.రసజ్ఞ 957వ ర్యాంకు, సీహెచ్ సంగీత 2953వ ర్యాంక్, వి.రత్నశ్రీ 3446వ ర్యాంక్, ఎస్.ఉదయకిరణ్ 4326వ ర్యాంక్, ఎం.నిఖిల్ 4677వ ర్యాంక్, డి.మంజుల 4985వ ర్యాంక్ అలాగే ఎం.దేవరాజకుమారి 5075వ ర్యాంకు సాధించినట్లు డాక్టర్ విద్యాధర తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి సీఎస్ శ్రీనివాస్, కళాశాల కోశాధికారి రాయపాటి గోపాలకృష్ణ జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థు లను అభినందించారు.


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డాక్టర్ సూర్యదేవర విద్యాధర తదితరులు

డాక్టర్ కొమాండూరి శేషాద్రికి భూసురపల్లి ఆదిశేషయ్య పురస్కారం

గుంటూరు(తూర్పు), జూన్ 22 : ప్రఖ్యాత డోలు విద్వాంసులు, లయ బ్రహ్మ భూసురపల్లి ఆదిశేషయ్య పురస్కారాన్ని ప్రముఖ గాన విద్యా వాచస్పతి డాక్టర్ కోమాండూరి శేషాద్రికి అందజేశారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సాహితి వేత్తలు, విద్వాంసులు పాల్గొన్నారు. సభకు సాహితివేత్త మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని భూసురపల్లి వెంకటేశ్వర్లు పర్యవేక్షించగా ఆలయ కమిటీ అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆత్మీయ అతిథులుగా రామరాజు ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఏఎస్‌యూ ప్రొఫెసర్ ఆచార్య ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భూసురపల్లి విజయలక్ష్మి, రాహుల సురేష్ బాబు, ప్రదీప్తి ప్రహ్లాదుడు, మౌనిక వేద వ్యాసుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాదస్వర విద్వాంసులు నాదెండ్ల శ్రీనివాసరావు, పాకల శ్రీహరి, డోళ్ల కలవకూరి శ్రీనివాసులు, భీమవరం భీమవరపు అశోక్ లచే నిర్వహించిన నాదస్వర కచేరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది.


కొమాండూరి శేషాద్రికి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

మహిళ మెడలో గొలుసు చోరీ

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 22 : పాత గుంటూరులో మహిళ మెడలో గొలుసు చోరీకి గురైన సంఘటన శనివారం జరిగింది. పాత గుంటూరు బాలాజీ నగర్‌కు చెందిన నూతలపాడు రాజ్యలక్ష్మి శివాలయానికి వెళ్లేందుకు బయలుదేరింది. మార్గమధ్యలోని కట్ట వారి వీధిలో వెనుకనుంచి బైక్ పైన వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆ మెడలో గొలుసు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రంగరాజు, పరమహంస తదితరులు

సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

గుంటూరు, జూన్ 22: దివ్యాంగులకు తోడ్పాటు అందిస్తూ వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సమర్థనం దివ్యాంగుల సంస్థ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఈనెల 28వ తేదీ మెగా జాబ్ మేళాను అమరావతి రోడ్డులోని హిందూ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో నిర్వహిస్తున్నట్లు సమర్థనం రీజనల్ మేనేజర్ ఎంఆర్‌కే పరమహంస తెలిపారు. జాబ్ మేళా ఉదయం 9 నుంచి మధ్యాహ్నాం 3:00 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ మేరకు శనివారం హిందూ ఫార్మసీ కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు, పరమహంస పలువురు నిర్వాహకులు పోస్టర్లును ఆవిష్కరించారు. అనంతరం రంగరాజు మాట్లాడుతూ దివ్యాంగులలో ఉన్న పట్టుదల చాలా స్ఫూర్తిదాయకంగా ఉంటుందని అన్నారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనేవారు 18 నుంచి 35 సంవత్సరాల వయసు, విద్యార్హత పదో తరగతి, ఇంటర్, డిగ్రి, పీజీ విద్యార్థులకు 30కి పైగా వివిధ రకాల కంపెనీలలో ఉద్యోగ అవకాశాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలు తీసుకొని 28వ తేదీ జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 6364867800, 6364867801, 6364867802, 6364867803 నెంబర్లను సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వి నాగభూషణం, ఫార్మా డి డైరక్టర్ పి.సీతారామయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసాద్ రావు తదితరులున్నారు.


ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న పూర్వ హెచ్ఎం మోహనరావు, విద్యార్థులు

ఎస్‌కేబీఎంఎం పూర్వ విద్యార్థుల వితరణ

● ప్రతిభావంతులకు రూ.1.45 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ

గుంటూరు(విద్య), జూన్ 22 : మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థులు అందిస్తున్న సేవలు అమూల్యమని ఎస్‌కేబీఎంఎం హైస్కూల్ పూర్వ ప్రధానోపాధ్యాయులు పాకనాటి మోహనరావు అన్నారు. ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎంఎం మున్సిపల్ హైస్కూల్లో ప్రతిభ గల విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉపకార వేతనాల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన 21 మంది విద్యార్థులతో పాటుగా 6 నుంచి 9వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఈ ఏడాది మొత్తం రూ.1.45 లక్షల నగదును అందించినట్లు వివరించారు. పూర్వ విద్యార్థి శైలజ ప్రత్యేకంగా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి చేతి గడియారం, కొందరికి పెన్నులు అందించారు. మరొక పూర్వ విద్యార్థి కన్నా అనూష విద్యార్థులందరికి వివేకానందుని సూక్తులకు సంబంధించిన పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు శైలజ, అనూష, శ్యాం ప్రసాద్, మధులాల్, ఆళ్ల వీరభద్రరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమాశంకర్‌కు లెజెండ్స్ ఆఫ్ గైనకాలజీ అవార్డు

గుంటూరు (మెడికల్) జూన్ 22: నగరానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌కు లెజెండ్స్ ఆఫ్ గైనకాలజీ అప్రిషియేషన్ అవార్డు లభించింది. కోల్‌కత్తాలో శనివారం జరిగిన అఖిల భారత స్త్రీ, ప్రసూతి వైద్యనిపుణుల సమాఖ్య (ఫాక్సీ) జాతీయ సదస్సు విజ్‌డమ్ 2024 అప్‌డేట్‌లో ఆయనకు ఈ అవార్డును అందజేశారు. మహిళల ఆరోగ్యాభివృద్ధికి, ప్రసూతి వైద్య రంగంలో ఆయన అందించిన వైద్యసేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందజేసినట్లు ఫాక్సీ ప్రతినిధులు ప్రకటించారు. ఫాక్సీ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ సునీత తండూల్ వర్కర్ అవార్డును డాక్టర్ ఉమాశంకర్‌కు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫాక్సీ జాతీయ మాజీ అధ్యక్షురాలు డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ రిషికేష్, బెంగాల్ ఓబీజీ సొసైటీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ భాస్కర్ పాల్ తదితరులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అందించిన సేవలను ప్రశంసించారు.

రేపటి నుంచి జీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

● కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 22 : ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రివెన్స్ రీడర్స్ సిస్టం (పీజీఆర్ఎస్)ని సోమవారం జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని, కార్యక్రమంలో నగరపాలక సంస్థలోని వివిధ విభాగాధిపతులు, అధికారులు పాల్గొంటారన్నారు. నగర ప్రజలు తమ స్థానిక సమస్యలపై పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలు, ఫిర్యాదులను అందించవచ్చని, వాటిని నిర్దేశిత సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.


మంత్రి నారా లోకేశ్‌ను సన్మానిస్తున్న ఎంపీలు

ఎంపీలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్

గుంటూరు, జూన్ 22(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాలకు హాజరు కానున్న టీడీపీ ఎంపీలందరికీ రాష్ట్ర మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్లమెంట్‌లో అనుసరించాల్సిన విధివిధానాలపై సలహాలు, సూచనలు అందించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం టీడీపీపీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటుగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, లావు శ్రీకృష్ణదేవరాయలతో లోకేశ్ మాట్లాడారు. అనంతరం ఎంపీలందరూ మంత్రి లోకేశ్‌ను ఘనంగా సన్మానించారు.

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలసిన ఐజీ త్రిపాఠి

గుంటూరు, జూన్ 22 : డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను సౌత్ కోస్టల్ జోన్ ఐజి ఎస్ఎస్ త్రిపాఠి శనివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఇటీవలి ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఘన విజయం సాధించడంతో పాటు ఆయన డిప్యూటీ సీఎంగా, మంత్రిగా ఎన్నికైన నేపద్యంలో ఆయనను ఐజీ కలసి శుభాకాంక్షలు చెప్పారు.

వైసీపీ కోవర్టులను కీలక బాధ్యతల నుంచి తొలగించండి

● దేవదాయశాఖ సహా వ్యవస్థలన్నింటినీ భ్రష్టుపట్టించారు
● సీఎం చంద్రబాబుకు వివరాలు అందజేసిన బ్రాహ్మణ చైతన్య వేదిక


సీఎం చంద్రబాబుతో శిరిపురపు శ్రీధర్

గుంటూరు, జూన్ 22 : గత వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ మొదలు దేవదాయ శాఖ సహా అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించి నేటికీ ఆయా కీలక విభాగాల్లో కొనసాగుతోన్న వైసీపీ కోవర్టులను తక్షణం తొలగించి వారిపై చట్టప్రకారం తగు చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శిరిపురపు శ్రీధర్ శర్మ కోరారు. ఈ మేరకు శనివారం శ్రీధర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి దేవదాయశాఖతో పాటు మిగిలిన కొన్ని శాఖల్లో అవినీతి అధికారులు, వైసీపీ కోవర్ట్ అధికారుల వివరాల జాబితాను అందించారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలను, ముఖ్యంగా టీడీపీ నేతలను, శ్రేణులను వేధించిన కొంతమంది అధికారులు మళ్లీ టీడీపీ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు స్వీకరించడానికి పైరవీలు ప్రారంభించా రన్నారు. దీనిపై ప్రభుత్వం జాగ్రత్త వహించాల్సిందిగా చంద్రబాబుకు శ్రీధర్ విన్నవించారు. గత ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించి వారు చేసిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుని ఆయా వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టి ప్రజలకు మంచి పాలన అందించాలని కోరారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ అవినీతి, అధికారులు, వైసీపీ కోవర్ట్ అధికారులు, సిబ్బంది ఎవరెవరున్నారు అనేది జిల్లాల వారీగా వివిధ శాఖల ప్రధాన కార్యాలయాల్లో సేకరిస్తున్నట్లు తెలిపారు. వారిపై ఖచ్చితంగా చర్యలు తీసుకుని పాలన గాడిలో పెడతామని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరావతి జేఏసీ నాయకులు పువ్వాడ సుధాకర్, ఎండపల్లి శబరి, వంగవీటి చైతన్య, నందివెలుగు చందు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'ఒలింపిక్ డే' రన్

గుంటూరు(తూర్పు), జూన్ 22 : ఒలింపిక్ డే పురస్కరించుకుని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో శనివారం ఒలింపిక్ రన్ నిర్వహించారు. రన్‌ను చీఫ్ కోచ్ నరసింహారెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ ఛైర్మన్ ఎస్.సుబ్బారావు క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. బీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమైన రన్ ఎన్టీఆర్ స్టేడియం వరకు సాగి, తిరిగి బీఆర్ స్టేడియానికి చేరుకుంది. రన్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి కే.వేణుగోపాలరావు, మాజీ అథ్లెటిక్స్ రాజేశ్వరరావు, వెంకటరెడ్డి, అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు నాగభైరు రంజిత్‌తో పాటు సీనియర్ వాకర్స్ పాల్గొన్నారు.



ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న క్రీడాకారులు, క్రీడా అసోసియేషన్ల ప్రతినిధులు

పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూన్ 22 : వైజాగ్‌లో ఈ నెల 30న జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పారా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2024 పోటీలకు జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్టు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి వై శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ ఆంధ్రప్రదేశ్, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 25వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. పేర్లు నమోదు కొరకు 94941 30391, 70135 69514 అనే నెంబర్లు సంప్రదించాలని సూచించారు.

24న 'ప్రజా సమస్య-పరిష్కార వ్యవస్థ' కార్యక్రమం

గుంటూరు(తూర్పు), జూన్ 22 : రాష్ట్ర ప్రభుత్వ అదేశాల మేరకు కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్య -పరిష్కార వ్యవస్థ' కార్యక్రమాన్ని ఈనెల 24న జరుపుతున్నట్టు కలెక్టర్ వేణుగోపాలరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ప్రతి సోమవారం జరిగే స్పందన స్థానంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా అధికారులు ప్రధాన కార్యాలయాల్లో, అలాగే డివిజన్ అధికారులు సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో హాజరవ్వాలని ఆదేశాలిచ్చారు. మండల అధికారులు తహసీల్ధారు కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చే అర్జీదారులకు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.

ఏఎన్‌యూలో దూరవిద్య కోర్సులు



గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) దూరవిద్య విభాగం- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఈ కోర్సులను ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో నిర్వహిస్తారు.

డిగ్రీ: బీఏ, బీకాం, బీబీఏ ప్రోగ్రామ్‌ల వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

బీఏ సబ్జెక్టులు: ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్.

బీకాం సబ్జెక్టులు: జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్

- బీబీఏ, బీఎల్ఐఎస్సీ, బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. బీఏ(ఎకనామిక్స్, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం(జనరల్) కోర్సులను తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో చదువుకోవచ్చు. మిగిలిన బీఏ కోర్సులు తెలుగు మాధ్యమంలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/పాలిటెక్నిక్ డిప్లొమా/రెండేళ్ల ఐటీఐ/ఇంటర్ ఒకేషనల్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎల్ఐఎస్సీ కోర్సుకు మాత్రం ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

పీజీ: ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సుల వ్యవధి రెండేళ్లు. మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సోషల్ వర్క్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్.

ఎంకాం స్పెషలైజేషన్‌లు: అకౌంటెన్సీ, బ్యాంకింగ్

- ఎంఏ కోర్సుల్లో లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లను ఆ మాధ్యమంలోనే చదవాలి. ఎంఏ(ఎకనామిక్స్/హిస్టరీ/పొలిటికల్ సైన్స్/సోషియాలజీ) కోర్సులు తెలుగు మాధ్యమంలో ఉన్నాయి. మిగిలిన కోర్సులను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి.

అర్హత: ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సులకు ఏదేని డిగ్రీ; ఎంఏ(ఎకనామిక్స్)కు బీఏ(ఎకనామిక్స్); ఎంకాం కోర్సుకు బీకాం/బీబీఏ; ఎంఎల్ఐఎస్సీ కోర్సుకు బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఏలో లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లకు ఆ లాంగ్వేజ్‌లు ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

డిప్లొమా: ఈ కోర్సుల్లో ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. ఫుడ్ ప్రొడక్షన్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు, సైకలాజికల్ గైడెన్స్ కోర్సుకు ఇంటర్/పన్నెండోతరగతి/పాలిటెక్నిక్ డిప్లొమా/రెండేళ్ల ఐటీఐ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్సులు: హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్, హెచ్ఐవీ ఎయిడ్స్ కౌన్సెలింగ్ కోర్సులు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి. హౌస్ కీపింగ్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు, ఎయిడ్స్ కౌన్సెలింగ్‌కు ఇంటర్(పారామెడికల్)తోపాటు ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.anucde.info

దిక్సూచి DIKSUCHI

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/MQRZNeDలో చదవండి.

విశాఖ ఐఐపీఈలో బీటెక్

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ)- బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్‌తోపాటు డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి క్యాట్ స్కోర్ లేకుండానే ఐఐఎం విశాఖపట్నంలో ఎంబీఏ చదివే వీలుంది.

విభాగాలు-సీట్లు: పెట్రోలియం ఇంజనీరింగ్‌లో 62 సీట్లు, కెమికల్ ఇంజనీరింగ్‌లో 63 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 40 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 65 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5
- **అకడమిక్ సెషన్ ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** iipe.ac.in

ఓయూలో లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. సాయంత్రం సమయాల్లో ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000.

అర్హత: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐ&ఎంఎల్ స్పెషలైజేషన్‌కు ఏ విభాగంవారైనా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఈ/ఏఐ/ఏఐడీ/ఏఐఎం /సీఎంఈ/సీఎస్‌బీ/సీఎస్‌సీ/సీఎస్‌డీ/సీఎస్‌జీ/సీఎస్ఐ/సీఎస్ఎం/సీఎస్ఎన్/సీఎస్ఓ/సీఎస్‌టీ/సీఎస్‌డబ్ల్యూ/సీఐసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థులందరికీ కనీసం ఏడాది ఫుల్ టైమ్ ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 11
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 18
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 21
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 27
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 3
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

విజువల్‌గా.. మ్యూజికల్‌గా...



నాగచైతన్య, సాయి పల్లవి జంటగా రూపుదిద్దుకుంటున్న 'తండేల్' చిత్రం వైజాగ్, శ్రీకాకుళం షెడ్యూల్ శనివారంతో పూర్తయింది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. ఈ షెడ్యూల్‌లో హీరోహీరోయిన్లతో పాటు ఇతర నటీనటులు పాల్గొనగా కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. పాత్రల గెటప్, కాస్ట్యూమ్స్, బాడీ లాంగ్వేజ్, యాస ప్రామాణికంగా ఉండేలా దర్శకుడు చందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాస్తవ సంఘటనల ప్రేరణతో ఓ ప్రేమ కథగా 'తండేల్' ను భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. విజువల్‌గా, మ్యూజికల్‌గా ఎంతో అద్భుతంగా ఉండేలా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ: షామ్‌దత్, ఎడిటింగ్: నవీన్ నూలి.

రామానుజుల గొప్పతనం చెప్పే కథ



డా. సాయి వెంకట్ టైటిల్ రోల్‌లో నటించి.. దర్శకత్వం వహించిన సినిమా 'జయహో రామానుజ'. జో శర్మ, సుమన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా వస్తున్న ఈ సినిమా ఫస్ట్ పార్ట్ జూలై 12న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'జయహో రామానుజ' సినిమా పాటలను చిత్ర బృందం శనివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు, హీరో సాయి వెంకట్ మాట్లాడుతూ 'మహిళల్ని గౌరవించాలని.. కుల మతాలకు అతీతంగా ఐకమత్యంతో మానవాళి కలసి ఉండాలని సందేశాన్ని ఇచ్చిన గొప్ప గురువు భగవత్ శ్రీ రామానుజాచార్యులు. ఆయన గొప్పదనం ఈ తరం వారికి తెలియాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందించాను' అని చెప్పారు. నిర్మాత ప్రవల్లిక మాట్లాడుతూ 'భారీ స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మించిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్, దర్శకుడు వీరశంకర్ పాల్గొన్నారు.

ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ



హాస్య నటుడు అలీ ఫ్యామిలీ నుంచి వచ్చిన సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన 'ప్రణయ గోదారి' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. పి.ఎల్. విఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గోదావరి అందాలు, నేచురల్ లొకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ చిత్రంలోని 'కలలో - కలలో' అంటూ సాగే గీతాన్ని సంగీత దర్శకుడు కోటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ పాట చూస్తుంటే చక్కని అనుభూతి కలుగుతోంది. సాహిత్యం, సంగీతం, హీరోహీరోయిన్ల అభినయం చక్కగా కుదిరాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే పాట అవుతుంది' అన్నారు. 'ఇది ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానం అందంగా చూపించే ప్రయత్నం చేశాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల చేస్తాం' అని తెలిపారు దర్శకనిర్మాతలు. సునీల్ రావినూతల, పృథ్వీ, సాయికుమార్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.

ప్రతిభావంతుడు ఎన్టీఆర్‌తో...



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది. ఈ సినిమాలోని ఓ పాటకు 'వార్', 'పఠాన్' సినిమాల ఫేమ్.. ప్రముఖ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిస్ నృత్యరీతుల్ని సమకూరుస్తున్నారు. థాయిలాండ్‌లో ప్రస్తుతం ఆ పాట షూటింగ్ జరుగుతోంది. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌తో తీసుకున్న ఫొటోను ఆయన షేర్ చేస్తూ.. "అత్యద్భుతమైన ప్రతిభావంతుడు ఎన్టీఆర్‌తో పనిచేయడం ఎంతో ఆనందాన్నిస్తోంది" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

కల్కి ప్రత్యేక షో, టికెట్ ధరల పెంపునకు అనుమతి



ప్రభాస్ హీరోగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం ప్రత్యేక ప్రదర్శన, టికెట్ ధరల పెంపునకు అనుమతినిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈనెల 27వ తేదీన చిత్రం విడుదల కానుంది. జూలై 4వ తేదీ దాకా 8 రోజుల పాటు ప్రతీరోజూ ఐదు షోలు ప్రదర్శించటానికి అవకాశం ఇచ్చారు. విడుదల రోజు ఉదయం 5:30 గంటలకు ప్రత్యేక ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ రోజు మొత్తం ఆరు షోలు ప్రదర్శించనున్నారు. ఇక టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ.200లకు పెంచుకోవడానికి అనుమతించారు. సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న టికెట్ ధరపై రూ.75, మల్టీప్లెక్స్‌లలో రూ.100 అదనంగా పెంచుకోవడానికి అనుమతిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జితేందర్ శనివారం మెమోనెం.23424/జనరల్.ఏ1/2024ను జారీ చేశారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

లక్కు..నీ వెంట ...



'నా పేరు శివ', 'అంధగారం' వంటి చిత్రాల్లో నటించిన వినోద్ కిషన్ ప్రస్తుతం 'పేక మేడలు' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. అనూష కృష్ణ హీరోయిన్. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రే నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం భార్గవ్ కార్తీక్ రాసిన 'లక్కు నీ వెంట కుక్క తోక లెక్క ఊపుకుంటూ వచ్చురో లచ్చన్న' అంటూ సాగే పాటను విడుదల చేశారు. నాగూర్ బాబు ఈ పాట పాడారు. స్మరణ్ సాయి సంగీత దర్శకుడు. ఈ సినిమాను జులైలో విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు.

తెనాలి వార్తలు

డిప్యూటీ సీఎంను కలసిన ఐజీ త్రిపాఠి

గుంటూరు, జూన్ 22 : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను సౌత్ కోస్టల్ జోన్ ఐజీ ఎస్ఎస్ త్రిపాఠి శనివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవలి ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఘనవిజయం సాధించడంతో పాటు ఆయన డిప్యూటీ సీఎంగా, మంత్రిగా ఎన్నికైన నేపథ్యంలో ఆయనను ఐజీ కలసి శుభాకాంక్షలు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆలపాటికి సముచిత స్థానం కల్పించాలి

● విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు

తెనాలి రూరల్, జూన్ 22: తెనాలి నియోజవర్గంలో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషిచేసిన మాజీ మంత్రి, టీడీపీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని టీడీపీ నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో ఐదేళ్ల వైసీపీ పాలనను ఎక్కడ కక్కడ ఎండగడుతూ ప్రజల్లో పార్టీని నిలిపిన నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించి ప్రజలందరి మన్ననలు పొందారన్నారు. ఎన్టీఆర్ ఆ నాడు పేదలకు పట్టెడన్నం పెట్టి కడుపునింపాలన్న సిద్ధాంతంతో పార్టీని స్థాపించారని ఆయన ఆశయాలను చంద్రబాబునాయుడు కొనసాగిస్తున్న తరుణంలో వైసీపీ ప్రభుత్వం ఆ క్యాంటిన్లను మూయించి అన్న క్యాంటిన్ పేరు కనుమరుగైపోయేలా దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. అటువంటి తరుణంలోకూడా తెనాలిలో అన్న క్యాంటిన్ పేరిట రెండు క్యాంటిన్లు ఏర్పాటు చేసి పేదల కడుపునింపి ప్రజల్లో తెలుగుదేశం పార్టీ కీర్తి మరింతగా ఇనుమడింపజేసేలా పాటుబడిన నాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. క్యాంటిన్‌ను తొలగించేందుకు వైసీపీ నాయకులు టీడీపీ క్యాడర్‌పై అనేక విధాలుగా కుట్రపూరితంగా వ్యవహరించినా వాటన్నింటిని ఎదుర్కొని చంద్రబాబు సంకల్పాన్ని ముందుకు నడిపించింది ఆలపాటి నాయకత్వమేనని చెప్పారు. రాజధాని అమరావతికోసం పోరాటాలు జరిపింది కూడా ఆలపాటి నాయకత్వంలోనేనని ఐదేళ్లపాటు పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటూ వస్తూ ప్రజానాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అనేలా నిలబడ్డారని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు రాజేంద్రప్రసాద్‌కు తగిన గౌరవం ఇస్తూ పదవిని కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు. పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, పెండ్యాల వెంకట్రావు, మహమ్మద్ ఖుద్దుస్, ఈదర వెంకటపూర్ణచంద్, కనకారాంబాబు, జొన్నాదుల మహేష్, పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న సంఘ సభ్యులు

ఆ నిధులు ఏమయ్యాయి ?

● రూ. 200 కోట్లపై తక్షణమే విచారణ జరిపించాలి..

● పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం ప్రతినిధులు డిమాండ్

తెనాలి అర్బన్, జూన్ 22: తెనాలి పురపాలక సంఘానికి వచ్చిన రూ200 కోట్లు నిధులు ఏమయ్యాయో విచారించాలని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ, మున్సిపల్ ఆదాయాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు మునిసిపల్ పన్నుల ద్వారా ఈ ఆదాయం చేకూరిందని, కానీ గత ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి కూడా చేపట్టలేదన్నారు. తెనాలి ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ అంశంపై దృష్టి పెట్టి ప్రజాధనం ఏమైయిందో విచారించాలని కోరారు. తెనాలిలో గంజాయి అమ్మకాలు, డ్రెయిన్లు, శాంతి భద్రతలు, రౌడీయిజం వంటి అంశాలపై వచ్చి రాగానే ఎమ్మెల్యే దృష్టి పెట్టారని, వారికి తెనాలి అభివృద్ధిలో తమ సంఘం చేయూత అందిస్తుందన్నారు. సంఘ అధ్యక్షుడు దర్శి శివకోటేశ్వరరావు, శివశంకర్, ఆరీఫ్, కమల్‌కుమార్, పేర్రెడ్డి, అబ్రహంలింకన్ పాల్గొన్నారు.



కసుకర్రు రహదారిపై గుంతలు పూడుస్తున్న టీడీపీ నాయకులు

రహదారిపై గుంతలు పూడ్చివేత

● సొంత నిధులను వెచ్చించి పనులు చేయించిన టీడీపీ నేతలు

పొన్నూరుటౌన్, జూన్22: మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతలను శనివారం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు స్వంత ఖర్చులతో పూడ్చి వేయించారు. పొన్నూరు, కాకుమాను మండలాలను కలిపే ప్రధాన రహదారి కసుకర్రు గ్రామం వద్ద గత కొన్ని నెలలుగా రహదారి ధ్వంసమై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతం నుంచి వెళ్లే వాహన చోదకులు ఈ గుంతలో పడి తరచూ ప్రమదాలకు గురవుతున్నారు. గుంతలు పూడ్చి రహదారికి మరమ్మతులు చేయాలని గత పాలకులకు, అధికారులకు అనేక సార్లు గ్రామస్థులు, వాహనదారులు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అయితే నూతన కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో గ్రామస్థులు స్థానిక టీడీపీ నాయకులను కలిసి సమస్యలను పరిష్కరించాలనివిన్నవించారు. స్థానిక టీడీపీ నాయకుడు బోప్పన్న బాపన్నయ్య ఆధ్వర్యంలో రహదారిపై ఏర్పడిన భారీ గుంతలను స్వంత ఖర్చుతో చిప్స్, కంకర వేసి పూడ్చి వేసారు. దీంతో స్థానికులు, ప్రయాణీకులు టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రైల్వే వంతెనపై అంధకారం..

తెనాలి రూరల్, జూన్ 22: మండలంలోని కొలకలూరు రైల్వే వంతెనపై వేసిన లైట్లు వెలగడం లేదు. ఫలితంగా రాత్రిళ్లలో ఆ వంతెనపై వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నందివెలుగు కూడలి నుంచి కొలకలూరు, ఎరుకలపూడి, హాఫ్‌పేట, మీదుగా విజయవాడ హైవే, గుంటూరుకు ఈ వంతెన మీదుగా వెళ్ళాల్సి ఉంటుంది. లైట్లు అమర్చినప్పటికీ వాటి నిర్వహణ లోపంతో కొంత కాలంగా అవి వెలగడంలేదు. ఫలితంగా చీకటి పడితే వంతెనపై అంధకారం అలుముకుంటుంది. పైగా వంతెన కింద భాగంలో మద్యం షాపు ఉండటంతో మందుబాబులు చీకటిలో వంతెనపైనే మద్యం తాగుతూ వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వంతెనపై లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రైల్వే వంతెనకు ఇరువైపులా అలంకార ప్రాయంగా ఉన్న లైట్లు

మంత్రి మనోహర్‌కు ఘన స్వాగతం

● మంగళ హారతులు ఇచ్చిన వీర మహిళలు



ప్రజలకు అభివాదం తెలుపుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, జూన్ 22 : ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తొలిసారిగా కొల్లిపర వచ్చిన సందర్భంగా కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. శనివారం కూటమి ఆధ్వర్యంలో మనోహర్‌ను నందివెలుగు నుంచి కుంచవరం, అత్తోట, సిరిపురం, చివలూరు, తూములూరు, దావులూరు అడ్డరోడ్డు మీదుగా కొల్లిపరకు భారీ ర్యాలీగా తీసుకువచ్చారు. మహిళలు హారతులిచ్చి అభిమానాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డులో జనసేన నేత అడపా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శ్రీఅంజనేయస్వామి ఆలయంలో మనోహర్ చేత ప్రత్యేక పూజలు నిర్వహించారు. కట్టా శ్రీహరి ఆధ్వర్యంలో జనసేన నాయకులు భారీ గజమాల వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మనోహర్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, మండల జనసేన అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, అడపా నారాయణరెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, అవుతు సంజీవరెడ్డి, వరికూటి నాగరాజు, యర్రా రాందాసు, ఏటీఎం శ్రీను, దాసరి నరసయ్య, నాదెండ్ల మనోహర్‌కు దుశాలువాలతో ఘనంగా సత్కరించి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం

● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

● స్పీకర్ అయ్యన్న పాత్రుడికి దుశ్శాలువాతో ఆత్మీయ సత్కారం



స్పీకర్ అయ్యనపాత్రుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, జూన్ 22: తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు సముచిత స్థానం లభిస్తుందని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శనివారం శాసన సభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చింతకాయల అయ్యనపాత్రుడిని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ బడుగు బహుజనులకు రాజ్యాధికారం సాధించేందుకే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందన్న విషయాన్ని గుర్తు చేసారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీ రామారావుదేనని అన్నారు. శాసన సభ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడిని ఏకగ్రీవంగా ఎంపిక చేయటం అన్నది బీసీలకు టీడీపీ ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తుందన్నారు. బీసీ నేత అయ్యన్నపాత్రుడు శాసన సభ స్పీకర్‌గా ఎన్నికైతే ఆయన పదవీ స్వీకార కార్యక్రమానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ రెడ్డి గైర్హాజరు అవటం బీసీలను అవమానపరచటమేనని అన్నారు. ప్రజలు వైసీపీని ఘోరంగా ఓడించినా జగన్ రెడ్డిలోని అహంకారం ఇంకా తగ్గలేదన్నారు. స్పీకర్ ఎన్నికకు విపక్షం రాని సందర్భాన్ని తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో తొలిసారిగా చూస్తున్నానన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శాసన సభలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నప్పటికి సభా సాంప్రదాయాలను వదిలిపెట్టలేదన్న విషయాలను గుర్తు చేసారు. ప్రజా తీర్పును గౌరవించే విధంగా విపక్ష చర్యలు ఉండాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ హితవు పలికారు.

పంటలు పండాలి.. రైతులు సుభిక్షంగా ఉండాలి

● ఎరువాక కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు



ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు

తెనాలి రూరల్, జూన్ 22: 'ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండి రైతుల ఇంట ఆనందం వెల్లివిరియాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను' అని జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండలంలోని కొలకలూరులో ఆదిత్య నందనవనం ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో) ఆధ్వర్యంలో ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు భూమి పూజచేసి వ్యవసాయ పనిముట్లకు కొబ్బరికాయలు కొట్టి పొలాలకు దుక్కులు దున్ని పదును పెట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రైతులు ప్రకృతి వ్యవసాయంవైపు మగ్గుచూపాలని, ఆ పద్ధతిలో పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు మంచి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను అందించిన వారవుతారని అన్నారు. భూమిలో భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్టె, జనుము, పిల్లిపెసర వంటి వాటిని పండించి రోటామీటర్ ద్వారా కలయబెట్టాలన్నారు. పసువుల ఎరువును పొలంలో చిమ్మడం ద్వారా భూమిలో పోషకలోపాలు తగ్గి పంటలు బాగా పండుతాయన్నారు. రైతులకు ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలను అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందని కేజీ రూ.5 సబ్సిడీతో పొందవచ్చని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది అన్నదాతలకు అందుబాటులో ఉంటూ తక్కువ పెట్టుబడితే అధిక దిగుబడులు సాధించేలా ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎఫ్‌పీవో గ్రూప్ డైరెక్టర్ యర్రం శెట్టి హనుమంతరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుంటూరు పకృతి వ్యవసాయం డీపీడీ రాజకుమారి, తెనాలి ఏడీఏ ఉషారాణి, ఏవో ప్రేమసాగర్, ఏఈవో మోహన్, విఏఏలు నాగరాజు, నాగేంద్ర, వంశీ, ఎఫ్‌పీవో సభ్యులు, సీఆర్‌పీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా గోవర్ధనస్వామి కల్యాణం

తెనాలి అర్బన్, జూన్ 22: రుక్మిణి సత్యభామ సమేత గోవర్ధనస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. గాంధీచౌక్‌లోని ఆలయంలో కాకుమాను శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు వేదాంతం మాధవకుమార్, అర్చకులు రఘు, యశ్వంత్, మోహనవంశీ, కేశవకుమార్‌లు కళ్యాణ క్రతువు నిర్వహించారు. ఈవో మల్లేశ్వరి, శ్రీహరి, జ్యోతిర్మయి, మల్లిఖార్జునరవు, తారానాథ్ పాల్గొన్నారు.

దోమలపై ఎంటమలాజికల్ సర్వే

● వివిధ వ్యాధుల వ్యాప్తిపై అవగాహన ర్యాలీ

తెనాలి, మారీసుపేట జూన్ 22: పట్టణంలో దోమలపై మలేరియా సిబ్బంది ఎంటమలాజికల్ సర్వేను నిర్వహించారు. స్థానిక ఇందిరా యానాది కాలనీలో శనివారం జిల్లా జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ గొల్ల వీర్రాజు ఆధ్వర్యంలో పట్టణ మలేరియా యూనిట్ అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ దోమల రకాలను తెలుసు కోవటం కోసం ఈ ఎంటమలాజికల్ సర్వే నిర్వహించామన్నారు. ఈ సర్వేలో దోమలను సేకరించడంతో పాటు దోమల ద్వారా వ్యాపించే మలేరియా, మెదడువాపు, బోదకాలు, జికావైరస్ తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర రెడ్డి, యూఎల్పీ ఆరోగ్య విస్తరణాధికారి అందె చంద్రమౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, పున్నారెడ్డి, మలేరియా అధికారులు పాల్గొన్నారు.

పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశాలతో

గంజాయిపై ఉక్కుపాదం

తెనాలి రూరల్, జూన్ 22: వైసీపీ ఐదేళ్ల పాలనలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకపోగా గంజాయి మత్తుకు అలవాటు చేసి నిండు జీవితాలను చీటకిమయం చేసేలా ప్రేరేపించారని.. తాను అధికారం చేపడితే గంజాయిపై ఉక్కుపాదం మోపి యువత పెడదోవ పట్టకుండా బాధ్యత తీసుకంటానని ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే గంజాయి రహిత గుంటూరుగా తీర్చిదిద్దేలా అధికారులను ఆదేశించారని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి అన్నారు. శనివారం మండలంలోని అంగలకుదురులో మురళి విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినతర్వాత రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. ముఖ్యంగా గుంటూరు పార్లమెంట్ సభ్యునిగా పెమ్మసాని చంద్రశేఖర్ విజయం సాధించిన అనంతరం ఈ ప్రాంతంలో పట్టిపీడిస్తున్న గంజాయి మహమ్మారిపై పెమ్మసాని దృష్టిపెట్టి పోలీసులకు ఇచ్చిన ఆదేశాలతో దాడులు జరుపుతూ గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. పాలన అంటే ఇలా ఉండాలనేలా ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. పెమ్మసాని వంటి నాయకుడు మన ప్రాంతానికి రావడం ప్రజలందరూ గర్వించదగ్గ విషయమన్నారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ప్రధాన సమస్యలపై పెమ్మసాని ఇప్పటికే దృష్టిపెట్టారని త్వరలోనే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసకుంటారని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రజల సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానంటూ ప్రజల ముందునిలిచిన ఏకైన నేత పెమ్మసాని చంద్రశేఖర్ అని ఆయనకు గణేష్ యూత్ తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని మురళి స్పష్టం చేశారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తెనాలి అర్బన్, జూన్ 22 : తెనాలి రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన తోటకూర చంద్రరావు సహకారంతో ఎన్నారై వైద్య కళాశాల నేత్ర వైద్య నిపుణులు రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. శుక్లం ఆపరేషన్ ఉన్న వారిని ఎంపిక చేసి ఎన్నారై హాస్పటల్‌లో ఉచితంగా చికిత్స చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

వైభవంగా శాంతి హోమాలు



శాంతి హోమాలలో పాల్గొన్న భక్తులు

తెనాలి, మారీసుపేట జూన్ 22: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం నందు శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) స్వయం పర్యవేక్షణలో శ్రీనవగ్రహ సహీత శ్రీనక్షత్ర సంపూర్ణ శాంతి హోమ పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం 10వ రోజు మూల నక్షత్రం వారిచే గణపతి పూజ, గణపతి హోమం, రుద్రాభిషేకాలు, నవగ్రహ హోమం, శ్రీమహామృత్యుంజయ హోమాలను యల్లాప్రగడ పవన్‌కుమార్‌శర్మ ఋత్విక్కులచే యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ మూల నక్షత్ర దోషాలు ఉన్న వారు ఈ హోమం చేయుట వలన దోషాలను నివృత్తి చేసుకోవచ్చాన్నారు. మూల నక్షత్రం విశిష్టతను, శాంతి హోమం చేయుటవలన జరుగు ఫలితాలను తెలియజేశారు. సాయంత్రం ఉభయ దేవేర్లతో స్వామి వారికి తిరుమంజనం సేవలను నిర్వహించారు. స్వామి వారికి లక్ష తులసీ దళార్చన, గోవింద నామార్చన, విశేష ద్రవ్యములతో తిరుమంజనం, విశేష హారతులను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, పెనుగొండ వెంకటేశ్వరావు, జాయింట్ సెక్రటరీ ముద్దభక్తుని రమణయ్య, రావూరి సుబ్బారావు, రాజేశ్వరరావు, గోపు రామకృష్ణ, కోన నాగేశ్వరావు, లోకనాధం, జయలక్ష్మీ మాతృ మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న చాగంటి

తెనాలి అర్బన్, జూన్ 22 : ప్రముఖ ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శనివారం షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించి పూజలు చేశారు. తెనాలిలో ఉన్న ఇటువంటి ఆలయం మరెక్కడా లేదని, ఉజ్జయినిలో మాత్రమే చూశానని అన్నారు. పంచముఖాలను దర్శించుకునేందుకు వీలుగా ఐదు ద్వారాలు ఏర్పాటు చేయడం అద్భుతమన్నారు. ఈ దర్శనం పరబ్రహ్మ స్వరూపమేనని పంచ భూతాలకు మోక్షాన్ని కూడా ఇవ్వగలవని చెప్పారు. దేవాలయ దర్శనం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. భక్తులు కానుకలు ఇవ్వకుండా మొక్కలు నాటి పెంచాలని, సంరక్షించాలని కోరారు. చాగంటి దంపతులకు అర్చక సిబ్బంది, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.



విద్యార్థులను సత్కరించిన పూర్వ విద్యార్థుల సంఘ నేతలు

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందజేత

తెనాలి, మారీసుపేట జూన్ 22: స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మునిసిపల్ బాలురోన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థి సంఘ సభ్యులు 10వ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రోత్సహక నగదును అందించి సత్కరించారు. పాఠశాల పూర్వ విద్యార్థి సంఘ వ్యవస్థాపకుడు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా న్యాయవాది పొన్నం విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, అప్పుడే తమ ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం షేక్ మౌలాబీ, సంఘ సభ్యులు బట్టా అంజయ్య బాబు, చుక్కా భానుప్రసాద్, కాసరనేని శ్రీనివాసరావు, పోతంశెట్టి శ్రీకాంత్, నారిశెట్టి శ్రీనివాసరావు, ముద్దాభక్తుని రమణయ్య, జవంగుల శివరామకృష్ణ, పొట్టి నరేంద్ర, తమిరిశ రఘు, సీతారామయ్య, శివభాస్కర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు విజయలక్ష్మి, నాగార్జున, సౌమ్య, ప్రియాంక తదితరులు

సీఎంఈపై అవగాహన

తెనాలి, మారీసుపేట జూన్ 22: స్థానిక బోసు రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియెషన్ హాల్లో శనివారం కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) కార్యక్రమాన్ని ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ జే విజయలక్ష్మి సారధ్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు శ్రేష్ట హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ జీ నాగార్జున హాజరై 'ఐబీఎస్ డ్రివెన్ ప్రిసిషన్ ఇన్ కాంప్లెక్స్ కరోనరీ ఇన్టీవెంక్షన్స్' అనే అంశంపై ప్రసంగించారు. మరో వైద్యరాలు ఎం. సౌమ్య 'టైమ్ ఈస్ బ్రెయిన్ స్పెక్ట్రమ్ ఆఫ్ స్ట్రోక్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై ప్రసంగించారు. గుండె పోటు వచ్చినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ పవని ప్రియాంక 'క్లీనికల్ డైలమా అబ్సెంట్ బ్రీత్ సౌండ్స్ మల్టిడిస్ప్లినరీ అప్రోచ్' అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో కోశాధికారి కే.శ్యామ్‌ప్రసాద్, సహాయ కార్యదర్శి డాక్టర్ మధు ప్రభాకర్‌బాబు, సీనియర్ వైద్యులు దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీ కాలనీలో బడి బాటను నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

డ్రాపౌట్స్ తగ్గించటానికే 'నేనూ బడికి పోతా'

పొన్నూరుటౌన్, జూన్22: పాఠశాల్లో డ్రాపౌట్స్ తగ్గించటానికే బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు 2వ ఎంఈవో కే.శ్రీనివాస రెడ్డి తెలిపారు. పట్టణంలోని 5వ వార్డు పరిధిలోని మున్సిపల్ హైస్కూల్ సమీపం లోగలఎస్టీ కాలనీలో శనివారం 'నేను బడికి పోతా..' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎస్టీ కాలనీలో పర్యటించిన అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాల్లో అందుతున్న సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లిదండ్రుకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్లాలని సూచించారు. బడి ఈడు చిన్నారులు బడికి వెళ్లేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. బాలబాలికల విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, అనేక సంక్షేమ పథకాలను అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

ఉత్సాహంగా 'ఒలింపిక్ డే' రన్

గుంటూరు(తూర్పు), జూన్ 22 : ఒలింపిక్ డే పురస్కరించుకుని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో శనివారం ఒలింపిక్ రన్ నిర్వహించారు. రన్‌ను చీఫ్ కోచ్ నరసింహారెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ ఎస్.సుబ్బారావు క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. బీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమైన రన్ ఎన్టీఆర్ స్టేడియం వరకు సాగి, తిరిగి బీఆర్ స్టేడియానికి చేరుకుంది. రన్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి కే.వేణుగోపాలరావు, మాజీ అథ్లెటిక్స్ రాజేశ్వరరావు, వెంకటరెడ్డి, అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు నాగభైరు రంజిత్‌తో పాటు సీనియర్ వాకర్స్ పాల్గొన్నారు.